
మూలవిరాట్‌ను తాకిన సూర్యకిరణాలు, దర్శించుకుంటున్న భక్తులు

కమనీయం.. ఆదిత్యుని కిరణ దర్శనం

అరసవల్లి, అక్టోబరు 1: ప్రత్యక్షదైవం.. ఆరోగ్యప్రదాత.. అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామిని ఉదయభానుని లేలేత కిరణాలు తాకాయి. ఈ అపురూప ఘట్టం మంగళవారం ఉదయం ఆవిష్కృతమైంది. ఉదయం 6.05 నిమిషాలకు సూర్యకిరణాలు గోపురాన్ని దాటుకుంటూ అనివెట్టి మండపం, ధ్వజస్తంబం మీదుగా, ఆలయ పంచద్వారాలను దాటుకుంటూ, గర్భగుడిలోని స్వామి మూలవిరాట్‌ను తాకాయి. ఈ కమనీయ దృశ్యాన్ని అధిక సంఖ్యలో భక్తులు వీక్షించి.. పులకించారు. ఓం నమో సూర్యదేవాయ అనే నామస్మరణ మార్మోగింది. రెండేళ్లుగా వాతావరణంలో మబ్బుల కారణంగా ఆదిత్యుడికి కిరణాలు స్పృశించేవి కాదు. దీంతో భక్తులు నిరాశ చెందేవారు. ఈ సారి మాత్రం కిరణాలు తాకడంతో స్వామి స్వర్ణ కాంతులతో దర్శనమిచ్చారని భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ మాట్లాడుతూ ఏటా మార్చి నెల 9, 10 తేదీల్లో, అక్టోబరు 1, 2 తేదీల్లో స్వామి మూలవిరాట్‌ను సూర్యకిరణాలు తాకుతాయని తెలిపారు. ఈసారి కిరణస్పర్శతో అత్యంత ప్రకాశవంతంగా స్వామి దర్శనమిచ్చారన్నారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కనకరాజు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తమ్మా.. కరుణించమ్మా

- కోటబొమ్మాళిలో జాతర ప్రారంభం

కోటబొమ్మాళి, అక్టోబరు 1: భక్తుల పాలిట కల్పవల్లిగా పేరొందిన కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి ఉత్సవాలు మంగళవారం అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కొత్తమ్మ తల్లీ.. కరుణించమ్మా అని వేడుకున్నారు. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు.. కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి.. ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ సంప్రదాయం ప్రకారం దేవదాయశాఖ ఆలయ మేనేజర్ వాకచర్ల రాధాకృష్ణ స్వాగతం పలికారు. వేద పురోహితులు సుసరాపు గణపతిశర్మ, లక్ష్మీకాంతం శర్మ పూర్ణకుంభంతో వేదమంత్రోచ్చారణల నడుమ ఆలయంలో పూజలు నిర్వహించారు. అలాగే ఆలయంలో అమ్మవారి జంగిడిని అసాదీల కుటుంబ సభ్యులు తలపై పెట్టుకుని.. అమ్మ నిలయమైన రెడ్డికివీధి చెందిన కమ్మకట్టు చిన్నప్పలనాయుడు ఇంటి వరకూ ఊరేగించారు. మేళతాళాలతో పెద్ద ఎత్తున మహిళలు కలశాలతో తరలివెళ్లారు. మళ్లీ కొత్తమ్మతల్లి ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వర రెడ్డి, శ్రీకాకుళం, నరసన్నపేట ఎమ్మెల్యేలు గొండు శంకర్, బొగ్గు రమణమూర్తి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే ఆలయ ప్రాంగణంలో అంబికాదర్బార్ ఏర్పాటు చేసిన ఐదు అడుగుల అగరబత్తిని వెలిగించారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ అధ్య క్షుడు కింజరాపు హరివరప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు బోయిన రమేష్, గోవింద రాజులు, వెలమల కామేశ్వరరావు, తర్ర రామకృష్ణ, కోరాడ గోవిందరావు పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా టెక్కలి సీఐ కె.శ్రీనివాసరావు, ఎస్ఐ సత్యనారా యణ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.


కొత్తమ్మతల్లిని దర్శించుకున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు



సిక్కోలులో బాపూ బాట

- జిల్లాలో పలుసార్లు పర్యటించిన గాంధీజీ
- ప్రసంగాలతో ఉద్యమ స్ఫూర్తి నింపిన మహాత్ముడు
- నేడు గాంధీ జయంతి

(ఎచ్చెర్ల)

భరత మాత దాస్యశృంఖాల విముక్తికి అహింసా మార్గంలో పోరాటం చేసిన యోధుడు మహాత్మా గాంధీజీ. తన ప్రసంగాలతో ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తి నింపిన మహాత్ముడికి జిల్లాతోనూ అనుబంధం ఉంది. స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా ఆయన పలుమార్లు జిల్లాలో పర్యటించారు. సభలు, సమావేశాలతో ప్రజలను ఉత్తేజ పరిచారు. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని.. జిల్లాలో బాపూ వేసిన బాటలను స్మరించుకుందాం.

- మహాత్ముని అడుగులు తొలిసారిగా 1921లో సిక్కోలు గడ్డపై పడ్డాయి. అప్పటికి ఇంకా ఒడిశా రాష్ట్రం ఏర్పడలేదు. బ్రిటీష్ పాలనలో గంజాం జిల్లాలో సిక్కోలు ప్రాంతం ఉండేది. స్వాతంత్రోద్యమంలో భాగంగా మూడుసార్లు గాంధీజీ ఈ ప్రాంతాన్ని సందర్శించారు. ఉప్పు సత్యాగ్రహం, సహాయ నిరాకరణ, విదేశీ బహిష్కరణ, శాసనోల్లంఘన, క్విట్ ఇండియా ఉద్యమాల్లో జిల్లా ప్రజలను భాగస్వామ్యం చేసి సముచిత స్థానం కల్పించారు. బెజవాడ (విజయవాడ)లో జరగనున్న అఖిల భారత కాంగ్రెస్ సభకు మహాత్మగాంధీ కోల్‌కత్తా నుంచి వస్తూ ఆంధ్రాలోని కొన్ని పట్టణాల్లో ప్రసంగించారు. బాపూజీ 1921 మార్చి 28న కోల్‌కత్తా మెయిల్‌లో వస్తూ బరంపురం రైల్వేస్టేషన్‌లో దిగారు. బరంపురం మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు.. పట్టు చేతి రుమాలు మీద ముద్రించిన సన్మాన పత్రాన్ని గాంధీజీకి ఇచ్చారు. బరంపురం టౌన్‌హాల్‌ని మహిళా సభలో ఆయన ప్రసంగించారు. తర్వాత 29న రాత్రి సిక్కోలు గడ్డ మీదుగా విజయనగరానికి పయనమయ్యారు. ఈ క్రమంలో ఆంగ్లేయులపై వ్యతిరేక పోరాట ఉద్యమస్ఫూర్తి నింపారు.


శ్రీకాకుళంలో మహాత్మగాంధీ పర్యటన (ఫైల్)

స్వాతంత్ర్య కాంక్షతో 1927లో మరోసారి..

జిల్లాలో కాంగ్రెస్ నాయకత్వంలో స్వాతంత్ర్య ఉద్యమం ఉధృతంగా జరుగుతున్న సమయంలో 1927లో మరోసారి గాంధీజీ ఈ ప్రాంతాన్ని సందర్శించారు. మందస, బొబ్బిలి, పర్లాకిమిడి జమీందారీ ఉద్యమం కూడా బలపడింది. స్వాతంత్ర్య సమరం కీలక దశకు చేరుకున్న సమయంలో పోరాట తీరుతెన్నులు తెలుసుకునేందుకు 1927 డిసెంబరు 2 నుంచి మూడు రోజుల పాటు శ్రీకాకుళం, మెళియాపుట్టి, సారవకోట, నౌపడ, పూండి, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం తదితర ప్రాంతాల్లో పర్యటించారు.

- శ్రీకాకుళం నగరంలో ప్రస్తుతం నాగావళి హోటల్ ఉన్న స్థలంలో మహాత్మునికి పౌరసన్మానం చేశారు. ఆ సమయంలో పొందూరు ఖద్దరుపై సన్మానపత్రాన్ని రాయించారు. అదేరోజు శ్రీకాకుళంలోని పురపాలక సంఘం మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో గాంధీజీ ప్రసంగించి.. స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపారు. తొలిరోజు పాలకొండ రోడ్‌లో ఎంబాడ హనుమంతురావు ఇంట్లో బస చేశారు. రోడ్డు విస్తరణలో ఆ ఇల్లును కూల్చివేశారు. మహాత్ముని ఈ ప్రాంత పర్యటనకు అంధవరం వెంకటరావు, రమణమ్మ తమ కారును సమకూర్చడంతో పాటు మెడలోని ఐదు తులాల బంగారు గొలుసును విరాళంగా అందజేశారు. బాపూజీ ప్రయాణించిన ఆ కారును శ్రీకాకుళానికి చెందిన అక్రం నడిపారు.

వంశధార నది దాటుతూ..

గాంధీజీ కారులో ప్రయాణించేందుకు వీలుగా వంశధార నదిపై ప్రస్తుతం మడపాం వంతెన వద్ద కాజ్‌వేను ఏర్పాటు చేశారు. దీనికి సహకరించారన్న నెపంతో ఇంజనీర్ హరిశ్చంద్రపాడిని బ్రిటీష్ ప్రభుత్వం ఉద్యోగం నుంచి తొలగించింది. మడపాం మీదుగా సారవకోట వెళ్తూ.. తిలారు రైల్వే క్రాస్‌రోడ్ వద్ద గుమిగూడిన ప్రజలను ఉద్దేశించి గాంధీజీ మాట్లాడారు. మహాత్ముడు వంశధార దాటుతూ సారవకోట వెళ్లే క్రమంలో విశ్రాంతి తీసుకుంటారని భావించి నరసన్నపేట సమీపంలో తిలారు సంతకు వెళ్లే మార్గంలో.. స్వాతంత్ర్య సమరయోధుడు పొట్నూరు స్వామిబాబు ప్రత్యేక విశ్రాంతి భవనాన్ని ఏర్పాటు చేశారు. అయితే గాంధీజీ విశ్రాంతి తీసుకోనప్పటికీ నేటికీ గాంధీ గెస్టుహౌస్‌గానే పిలవబడుతుంది.

సారవకోటలో బస..

ఈ ప్రాంత గిరిజనులకు పర్లాకిమిడి భూస్వాములకు వ్యతిరేకంగా సారవకోటకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు బోయిన అప్పలస్వామి చేపట్టిన దీక్షను తెలుసుకుని గాంధీజీ 1927 డిసెంబరు 3న అక్కడికి చేరుకున్నారు. గాంధీజీకి అప్పలస్వామి ఆతిథ్యం ఇచ్చారు. ఆ రోజు రాత్రి మహాత్ముడు సారవకోట మెయిన్ రోడ్‌లోని రహదారి బంగ్లాలో బస చేశారు. అప్పట్లో గాంధీజీ బొప్పాయి, అరటి పళ్లు, ఖర్జూరం, మేక పాలు అల్పాహారంగా స్వీకరించారు. 1991 జనవరి 1న గాంధీజీ స్మారక గ్రంథాలయంగా నామకరణం చేశారు.


పూండిలో గాంధీజీ బస చేసిన భవనం

పూండిలో విడిది..

మెళియాపుట్టిలో బయలుదేరిన గాంధీజీ బెండి గేటు మీదుగా పూండి (వజ్రపుకొత్తూరు మండలం) రైల్వే స్టేషన్‌కు సమీపంలోని వరదా వారి భవంతిలో విడిది చేశారు. వరదా కామేశ్వరరావు, వరదా అప్పారావు నాయుడు ఆహ్వానం మేరకు గాంధీజీ పూండిని దర్శించారు. ఈ సమయంలోనే నాటి గంజాం జిల్లాలో ఉప్పు పండించే ప్రధాన కేంద్రమైన నౌపడ ప్రాంత రైతులతో గాంధీ పూండిలోనే సమావేశమయ్యారు.

మెళియాపుట్టిలో ఖాదీ షాపు ప్రారంభం

అలాగే ఇదే పర్యటనలోనే గాంధీజీ మెళియాపుట్టిని సందర్శించారు. దుక్క రాజన్నరెడ్డి, అంకణాల లక్ష్మీనారాయణ, లుకలాపు లక్ష్మణదాసు తదతరులు రాట్నంతో నూలు వడుకుతూ స్వాగతం పలికారు. ఈ సందర్భంలోనే గాంధీజీ ఖాదీ షాపును ప్రారంభించారు. గాంధీ మండపంగా నామకరణం చేయగా, ఇప్పుడది ఖాళీ స్థలంగా దర్శనమిస్తోంది. గాంధీజీ అక్కడ ఓ మర్రిచెట్టు కింద కూర్చొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

ఇచ్ఛాపురంలో ప్రసంగం..

పూండి నుంచి ఇచ్ఛాపురం వెళ్తున్న సందర్భంలో పలాస రైల్వేస్టేషన్‌లో గాంధీ వేచి ఉండాల్సి వచ్చింది. ఆ సమయంలో గాంధీజీ రక్షణగా పుక్కళ్ల తాతారావు (పీటీ నాయుడు, వజ్రపుకొత్తూరు) ఉన్నారు. 12మంది యువకుల తో స్కౌట్ యూనిఫాం వేయించి వారితో పాటు పీటీ నాయుడు రక్షణగా నిలిచారు. ఆ తర్వాత ఇచ్ఛాపురంలో పుల్లెల శ్యామసుందరరావు నాయకత్వంలో నిర్వహించిన సభలో ఉద్యమకారులు, ప్రజలను ఉద్దేశించి గాంధీజీ మాట్లాడారు.

1942లో మరోసారి..

1942లో క్విట్ ఉద్యమంలో భాగంగా గాంధీజీ దూసి రైల్వేస్టేషన్‌కు వస్తున్నారని తెలుసుకుని వివిధ గ్రామాల నుంచి స్వాతంత్ర్య సమరయోధులు.. తెల్లదొరలకు దొరకకుండా రైల్వేస్టేషన్‌కు సమీపంలోని తోటల్లో దాక్కున్నారు. గాంధీజీ ప్రసంగం కోసం దూసి వద్ద ప్రత్యేకంగా వేదిక ఏర్పాటు చేసినప్పటికీ.. ఎక్కువమంది ఉద్యమకారులు అక్కడికి చేరడంతో గాంధీజీ రైలు వద్దనుంచే 15 నిమిషాలు హిందీలో ప్రసంగించారు. అనాటి జ్ఞాపకాలు ఇప్పటికీ ఈ రైల్వేస్టేషన్‌లో సజీవంగా ఉన్నాయి. ఆనాడు గాంధీజీ నాటిన మొక్క నేడు ఎంతో విస్తరించి ఎంతోమందికి నీడను ఇస్తోంది.

12 నుంచి ప్రైవేటు మద్యం


- జిల్లాలో 158 దుకాణాల ఏర్పాటుకు నోటిఫికేషన్
- ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ
- ఈనెల 11న అంబేడ్కర్ ఆడిటోరియంలో 'డ్రా'

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో ఈ నెల 12 నుంచి ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు గెజిట్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు.. జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి సీహెచ్ తిరుపతినాయుడు మంగళవారం విడుదల చేశారు. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా 158 మద్యం దుకాణాల ఏర్పాటు చేయనున్నారు. 13 కేంద్రాల్లో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 12 నుంచి 2026 సెప్టెంబర్ 30 వరకు రెండేళ్ల కాల పరిమితికిగానూ మద్యం దుకాణాల ఏర్పాటు చేయనున్నారు. ఈనెల 9న సాయంత్రం వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. ఈ నెల 11న ఉదయం 8గంటలకు శ్రీకాకుళంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో దరఖాస్తులను కలెక్టర్ 'డ్రా' తీసి దుకాణాలను కేటాయిస్తారు. శ్రీకాకుళం, ఆమదాలవలస, రణస్థలం, పొందూరు, నరసన్నపేట, కొత్తూరు, పాతపట్నం, టెక్కలి, కోటబొమ్మాళి, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాల్లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. దుకాణాల ఏర్పాటుకుగానూ నాన్‌రిఫండబుల్ దరఖాస్తు రుసుం కింద రూ.2లక్షలు చెల్లించాలి. దుకాణం దక్కించుకున్నవారు మున్సిపల్ కార్పొరేషన్ పరిధితోపాటు పెద్ద మండలాల్లో తొలిఏడాది రూ.65లక్షలు, రెండో ఏడాది రూ.71.50 లక్షలు ఎక్సైజ్ ట్యాక్స్ చెల్లించాలి. ఆమదాలవలస, బూర్జ, సరుబుజ్జిలి, పలాస రూరల్ ప్రాంతాల్లో మాత్రం దుకాణాలను దక్కించుకున్నవారు తొలి ఏడాది రూ.55లక్షలు, రెండో ఏడాది రూ.60.50 లక్షలు ఎక్సైజ్ ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది.

- కొత్త దుకాణాల ఏర్పాటు ఇలా..

శ్రీకాకుళం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో 19 మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. గారలో 7, ఎచ్చెర్లలో 6, ఆమదాలవలసలో 7, బూర్జలో 2, ఎల్.ఎన్.పేటలో 2, సరుబుజ్జిలిలో 2, రణస్థలంలో 10, లావేరులో 5, పొందూరులో 6, జి.సిగడాంలో 4, నరసన్నపేటలో 8, పోలాకిలో 4, కొత్తూరులో 4 దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. హిరమండలంలో 3, పాతపట్నంలో 4, సారవకోటలో 4, టెక్కలిలో 6, నందిగాంలో 2, మెళియాపుట్టిలో 2, కోటబొమ్మాళిలో 6, సంతబొమ్మాళిలో 5, జలుమూరులో 4, పలాస టౌన్ అండ్ రూరల్‌లో 10, వజ్రపు కొత్తూరులో 5, సోంపేటలో 5, మందసలో 5, కంచిలిలో 2, ఇచ్ఛాపురంలో 5, కవిటి మండలంలో 3 చొప్పున మొత్తం 158 ప్రైవేటు మద్యం దుకాణాలు ఈనెల 12 నుంచి ఏర్పాటు కానున్నాయి.



జగన్.. రాష్ట్రాన్ని దోచేశాడు

- గత ప్రభుత్వంలో రూ.12లక్షల కోట్ల అప్పులు
- రూ.400కోట్లతో ఇంటింటికి తాగునీరు
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

సంతబొమ్మాళి, అక్టోబరు 1: వైసీపీ పాలనలో జగన్.. రూ.12లక్షల కోట్లు అప్పు చేసి.. రాష్ట్రాన్ని దోచుకున్నాడని వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. మంగళవారం సంతబొమ్మాళి మండలం నరసాపురంలో పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం సభలో మాట్లాడారు. 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు ప్రతి శాఖపై సమీక్ష చేయగా రూ.వేల కోట్లలో అప్పులు కనిపించాయి. గత ఐదేళ్లు అభివృద్ధి కుంటుపడింది. రోడ్లు, కాలువలు కనీస మరమ్మతులకు నోచుకోలేదు. కేంద్రం సహకారంతో అభివృద్ధి దిశగా చర్యలు చేపడుతున్నాం. అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు, పోలవరానికి రూ.12,500 కోట్లు, పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు రూ.3,500 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నాం. టెక్కలి నియోజకవర్గంలో రూ.400 కోట్లతో ఇంటింటికీ తాగునీరు అందిస్తాం. బొంతు జంక్షన్ వద్ద ట్యాంకు నిర్మించి.. వంశధార నది నుంచి నీటిని తెచ్చి నింపుతాం. ఆ నీటిని పైపులైన్ ద్వారా ఇంటింకీ అందిస్తామ'ని మంత్రి అచ్చెన్న తెలిపారు. కార్యక్రమంలో కింజరాపు హరివరప్రసాద్, వెలమల విజయలక్ష్మి, ఎంపీటీసీ మోడి రామచంద్రరావు, మాజీ సర్పంచ్ ఆల బైరాగి, మండల టీడీపీ కార్యదర్శి రెడ్డి అప్పన్న పాల్గొన్నారు.

97.89 శాతం పింఛన్ల పంపిణీ

కలెక్టరేట్: జిల్లాలో పింఛన్ల పంపిణీ ప్రక్రియ సందడిగా సాగింది. జిల్లావ్యాప్తంగా 3,15,630 మంది పింఛన్ దారులకుగానూ మంగళవారం 3,08,966 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. మొత్తంగా 97.89 శాతం పింఛన్ల పంపిణీ జరిగింది.


మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

విద్యార్థులతో 'బాపూ'

గాంధీ జయంతిని పురస్కరించుకుని రణస్థలంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. మంగళవారం పాఠశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ ఆధ్వర్యంలో 600మంది విద్యార్థులు 120 అడుగుల పొడవు, 120 అడుగుల వెడల్పుతో బాపూ చిత్రం వచ్చేలా కూర్చొన్నారు. ఉపాధ్యాయులు తామాడ ప్రసాద్, పి.కృష్ణ, పి.లక్ష్మణరావు, సూర్యప్రకాష్, పీఈటీ రాము విద్యార్థులకు సూచనలు చేశారు. - రణస్థలం



ఆలయాలే వీరి టార్గెట్

- 31 గుడులు, ఒక చర్చిలో చోరీలు
- 4 ఇళ్లు, 3 రైస్ మిల్లుల్లో కూడా..
- అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్
- రూ.91.38 లక్షల ఆభరణాలు, వాహనాలు, నగదు స్వాధీనం

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 1: అంతర్రాష్ట్ర దొంగల ముఠా పోలీసులకు పట్టుబడింది. జిల్లాలో కొన్నాళ్ల నుంచి ఆలయాల్లో వరుస చోరీల వెనుక ఈ ముఠా హస్తం ఉన్నట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ నేపథ్యంలో మొత్తం 39 కేసుల్లో రూ.91.38 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, ద్విచక్ర వాహనాలు, నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ముఠాలో తొమ్మిది మంది ఉండగా.. ఆరుగురిని అరెస్టు చేశారు. మరో ముగ్గురి కోసం గాలిస్తున్నారు. శ్రీకాకుళంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ మహేశ్వరరెడ్డి వెల్లడించారు. 'జిల్లాలో పొందూరు మండలం నందివాడలో దుర్గామాత ఆలయం, ఎచ్చెర్ల మండలం కుంచాలకురమయ్యపేటలో శ్రీచక్రాలయం, కోటబొమ్మాళిలో సాయిబాబా ఆలయం, శివాలయం, గార మండలంలో శ్రీ వెంకటేశ్వర, సాయిబాబా ఆలయాల్లో, శ్రీకాకుళంలో అమ్మవారి ఆలయంతో పాటు పలు ఆలయాల్లో ఇటీవల చోరీలు జరిగాయి. వాటిని ఛేదించేందుకు శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద ఆధ్వర్యంలో రణస్థలం సీఐ అవతారంతో పాటు మరో 8 మందితో ప్రత్యేక బృందాన్ని నియమించాం. తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లా మణిపూర్‌కి చెందిన బట్టిన శ్రీకాంత్ పండ్ల రవాణా వ్యాపారం చేస్తూ ఎల్.ఎన్.పేటకు చెందిన ఓ అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. అతడికి హిరమండలం మండలం గుర్రాలమెట్టకు చెందిన సవర సూర్యంతో పరిచయమైంది. సూర్యం 2019లో ఒడిశాలో ఓ మొబైల్ షాపులో దొంగతనం చేసి పోలీసులకు చిక్కాడు. అలాగే మద్యం దుకాణాల్లో కూడా దొంగతనాలు చేశాడు. వీరిద్దరూ స్థానిక యువకులను పరిచయం చేసుకుని.. వారికి డబ్బు ఆశ చూపించి మొత్తం 9మంది ఒక గ్యాంగ్‌గా ఏర్పడ్డారు. జిల్లాలో 2021 నుంచి చోరీలు చేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 23న ఎచ్చెర్ల మండలం కుంచాల కురమయ్యపేటలో శ్రీ రాజరాజేశ్వరీ శక్తి పీఠంలో జరిగిన దొంగతనం కేసు రణస్థలం సీఐ విచారించగా.. ఈ అంతరాష్ట్ర దొంగల ముఠా గుట్టురట్టయింది. దొంగల గ్యాంగ్‌కి సవర సూర్యం లీడర్‌గా వ్యవహరించగా, శ్రీకాంత్, ఎల్.ఎన్.పేట మండలం గొట్టిపల్లికి చెందిన కూరమాన శ్రీనివాసరావు, జోగివలసకి చెందిన సవర సిపన్న, గుర్రాలమెట్టకు చెందిన సవర చిన్నారావులు చోరీలకు సహకరిస్తున్నట్టు విచారణలో గుర్తించాం. వీరితోపాటు ఎల్.ఎన్.పేట మండలం కరిగుడకి చెందిన సవర భోగేష్, సిద్ధు, కొత్తూరు మండలం అడ్డాయిగూడకి చెందిన సవర మల్లేశ్వరరావు, చోరీలకు పాల్పడ్డారు. శీచక్రాలయంలో చోరీ కేసు విచారిస్తుండగా అజరాం రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న శ్రీనివాసరావు, సిపాన్న, మల్లేశ్వరరావు, భోగేష్, సిద్ధు కనిపించారు. వారిని సీఐ అవతారం విచారించగా నేరాలు అంగీకరించారు. వీరంతా 31 దేవాలయాలు, 4 ఇళ్లు, ఒక చర్చి, 3 రైస్‌మిల్లుల్లో చోరీ చేసినట్టు ఒప్పుకున్నారు. మన్యం జిల్లా సీతంపేటకి చెందిన కాకినాడ కృష్ణారావుకి దొంగిలించిన బంగారం అమ్మినట్లు చెప్పారు. ఈ చోరీ కేసుల్లో రూ.91.38లక్షల విలువైన 692 గ్రాముల బంగారు ఆభరణాలు, 52.880 కేజీల వెండి, రూ.3,38,570 నగదు, నాలుగు బైక్‌లు, రెండు కట్టర్‌లు రికవరీ చేశాం. చోరీకి పాల్పడిన శ్రీనివాసరావు, సిపాన్న, మల్లేశ్వరరావు, భోగేష్, సిద్ధును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాం. దొంగ బంగారం కొన్న కృష్ణారావును కూడా అరెస్ట్ చేశాం. సూర్యం, చిన్నారావు, శ్రీకాంత్ కోసం గాలిస్తున్నాం. దొంగతనాలకు పాల్పడిన ఈ తొమ్మిది మందిపై ఆంధ్రా, తెలంగాణల్లో 43 కేసులు ఉన్నాయి' అని ఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు. జిల్లాలో చోరీలకు పాల్పడుతున్న ముఠాను పట్టుకున్న డీఎస్పీ వివేకానంద, సీఐ అవతారం, క్రైం సిబ్బందిని అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, పట్టుబడిన ఆభరణాలు

మట్కాకు ముహూర్తం కుదిరింది



వరుణ్‌తేజ్ హీరోగా నటిస్తున్న 'మట్కా' చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది. 1958-82 మధ్య కాలంలో జరిగే పీరియాడికల్ మూవీ ఇది. ఇందులో వరుణ్ నాలుగు విభిన్న గెటప్స్‌తో కనిపిస్తారు. ప్రస్తుతం కీలకమైన యాక్షన్ ఎపిసోడ్‌ను దర్శకుడు కరుణకుమార్ చిత్రీకరిస్తున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా శరవేగంతో జరుగుతోందనీ, నవంబర్ 14న సినిమాను విడుదల చేస్తామనీ నిర్మాతలు డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి చెప్పారు. రిలీజ్ డేట్‌ను వెల్లడిస్తూ విడుదల చేసిన పోస్టర్‌లో సిగరెట్ కాలుస్తూ మెట్లు దిగి వస్తున్న వరుణ్‌తేజ్ రెట్రో గెటప్ ఆకట్టుకుంది. ఈ చిత్రంలో నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి హీరోయిన్లు.

'శ్వాగ్' ఒక వంశానికి సంబంధించిన కథ మాత్రమే కాదు పితృస్వామ్యం అనే క్లాష్ నుంచి 15వ శతాబ్దంలో మొదలయ్యే కథ కూడా. స్త్రీ, పురుషుల్లో ఎవరు గొప్ప అనే అంశంపై చర్చించే ఆసక్తికరమైన కథ. కొత్త కథలు ఎప్పుడు వచ్చినా ప్రేక్షకులు ఆదరిస్తారనే ధైర్యంతో ఈ సినిమా చేశాం' అన్నారు శ్రీవిష్ణు. ఆయన హీరోగా నటించిన 'శ్వాగ్' చిత్రం ఈ నెల నాలుగున విడుదలవుతున్న నేపథ్యంలో మీడియాకు చిత్ర విశేషాలు వెల్లడించారు.

మేకప్ కోసం నాలుగున్నర గంటలు



- నేనెప్పుడూ డ్యూయెల్ రోల్స్ వేయలేదు. కానీ ఇందులో నాలుగు పాత్రలు పోషించాను. అందరూ ఒకే పోలికలతో ఉండే ఒకే వంశస్తులు. ఎలా చేయాలన్నది సవాల్‌గా అనిపించింది. గెటప్స్ అన్నీ సెట్ అయ్యాక నమ్మకం కుదిరింది.. ఈ నాలుగు పాత్రల్లో సింగ పాత్ర కొంచెం ఈజీ అనిపించింది. మిగతా మూడూ కష్టమైనవే. రోజూ నాలుగున్నర గంటల సేపు మేకప్ చేసుకోవడం, దాన్ని తీయడానికి మరో రెండు గంటలు పట్టడం.. చాలా టఫ్. అయితే టీజర్‌కు వచ్చిన రెస్పాన్స్ చూసిన తర్వాత ఆ కష్టాన్ని మరిచిపోయా.
- చాలా పెద్ద కథ ఇది. దీన్ని రెండున్నర గంటల్లో చెప్పారా అని సినిమా చూశాక ప్రేక్షకులు దర్శకుడు హసిత్ గోలిని అభినందిస్తారు. కథలో భాగంగానే ఉండే వినోదం అందరినీ అలరిస్తుంది. నా కెరీర్‌లో వన్ ఆఫ్ ద టాప్ ఫిల్మ్‌గా నిలుస్తుందనే నమ్మకం ఉంది.
- సినిమాలో క్యారెక్టర్ బ్యాక్ స్టోరీస్ బాగా కుదిరాయి. రీతూ వర్మ పాత్రలో మంచి ట్రాన్స్‌ఫర్మేషన్ ఉంటుంది. ఈ సినిమా చూశాక మహిళల్ని ఎక్కువ అభిమానిస్తాం. గౌరవిస్తాం.
- ఒక థ్రిల్లర్ చేస్తున్నాను. అలాగే గీతా ఆర్ట్స్‌లో ఓ మంచి ఎంటర్‌టైనర్ చేస్తున్నాను.

గోవిందాకు బుల్లెట్ గాయం



ప్రమాదవశాత్తు తుపాకి పేలిన ఘటనలో బాలీవుడ్ సీనియర్ నటుడు గోవిందా గాయపడ్డారు. ఆయన కాలులోకి బుల్లెట్ దూసుకుపోయింది. కుటుంబ సభ్యులు ఆయన్ను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లడంతో వైద్యులు సర్జరీ చేసి ఆ బుల్లెట్‌ను తొలగించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందనీ, త్వరలోనే డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు తెలిపారు. మంగళవారం ఉదయం ముంబై జుహూలోని గోవిందా నివాసంలో ఈ ఘటన జరిగింది. ఆయన లైసెన్స్ రివాల్వర్ చేతిలో నుంచి జారి కిందపడి హఠాత్తుగా పేలింది.


జీబ్రా అందరికీ నచ్చుతుంది



సత్యదేవ్, కన్నడ నటుడు డాలీ ధనుంజయ నటిస్తున్న 'జీబ్రా' చిత్రం టీజర్‌ను హీరో నాని విడుదల చేశారు. ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వంలో ఎస్ఎన్ రెడ్డి, పద్మజ, బాలసుందరం, దినేశ్ సుందరం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. టీజర్ విడుదల కార్యక్రమానికి అతిథిగా వచ్చిన మంచు మనోజ్ మాట్లాడుతూ 'టీజర్ అదిరిపోయింది. ఈ చిత్ర నిర్మాత ఎస్సెన్ రెడ్డి నా శ్రేయోభిలాషి. బాగా ఖర్చుపెట్టి సినిమా తీశారు. నా అభిమాన నటుడు సత్యదేవ్. ఈ సినిమా ఘన విజయం సాధించాలి' అన్నారు. హీరో సత్యదేవ్ మాట్లాడుతూ 'ఓ కొత్త క్యారెక్టర్‌తో వస్తున్నా. అన్ని పరిశ్రమల్లోని ఆర్టిస్టులు, టెక్నీషియన్లు ఇందులో ఉన్నారు. ప్రతి వ్యక్తికి ఈ సినిమా నచ్చుతుంది' అన్నారు.

రజనీకి తీవ్ర అస్వస్థత

- రక్తనాళంలో వాపు
- స్టెంట్ వేసిన వైద్య బృందం



తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ తీవ్ర అస్వస్థతతో ఆసుపత్రిలో చేరారు. సోమవారం అర్ధరాత్రి ఆయన అస్వస్థతకు గురి కావడంతో కుటుంబీకులు ఆయన్ని గ్రీమ్స్‌రోడ్డులో వున్న అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. రజనీ అనారోగ్యం గురించి తెలియగానే ఆయన అభిమానులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల పూజలు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా వుందని, రెండు రోజుల్లో డిశ్చార్జ్ అవుతారని మంగళవారం ఆసుపత్రివర్గాలు ప్రకటించాయి. 'గుండె నుంచి బయటకు వచ్చే ప్రధాన రక్తనాళం (బృహద్ధమని)లో వాపు వచ్చింది. దీనికి శస్త్రచికిత్స చేయకుండా ట్రాన్స్‌కాథెటర్ విధానం ద్వారా చికిత్స చేయడం జరిగింది. సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సాయి సతీష్ సారథ్యంలోని వైద్య బృందం స్టెంట్ వేసి, వాపును సరిచేశారు. ఎండోవాస్క్యులర్ రిపేర్ ప్రణాళికాబద్ధంగా సాగిందని ఆయన శ్రేయోభిలాషులకు, అభిమానులకు తెలియజేయాలనుకుంటున్నాం. రజనీకాంత్ ఆరోగ్యం నిలకడగా ఉంది. రెండు రోజుల్లో ఆస్పత్రి నుంచి ఇంటికి వెళతారు' అని ఆసుపత్రి వర్గాలు హెల్త్ బులిటెన్‌లో పేర్కొన్నాయి. ఇదిలా వుండగా రజనీ త్వరగా కోలుకోవాలంటూ తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి స్టాలిన్ తదితరులు ఆకాంక్షించారు. తమిళనాడు ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం స్వయంగా ఆసుపత్రికి వెళ్లి రజనీ ఆరోగ్యంపై వాకబు చేశారు. రజనీ క్షేమంగా వున్నారని, కోలుకుంటున్నారని మంత్రి ప్రకటించారు.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

అన్ని వర్గాలకు కూటమి ప్రభుత్వం అండ

నరసన్నపేట: అన్ని వర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం దేవాది గ్రామంలో పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు సామాజిక పింఛన్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శిమ్మ చంద్రశేఖర్, ఎంపీడీవో మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు. రెడ్డికపేటలో ఎమ్మెల్యే సతీమణి బగ్గు సుగుణ పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గొద్దు చిట్టిబాబు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.


నరసన్నపేట: వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు

ప్రజాసంక్షేమానికి ప్రాధాన్యం: ఎమ్మెల్యే ఎంజీఆర్

ఎల్.ఎన్.పేట/మెళియాపుట్టి/హిరమండలం/కొత్తూరు: రాష్ట్రంలో ప్రజా సంక్షేమాన్ని సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మంగళవారం ముంగెన్నపాడు, పద్మ, ఎం.అవలంగి, గూనభద్ర గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వైవీ పద్మావతి, ఎంపీడీవో బి.శైలజ, ఇన్‌చార్జి ఎంపీడీవో ఐ.పద్మజ, జడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చి బాబు, టీడీపీ నేతలు ఎం.మనోహర్ నాయుడు, కె.చిరంజీవి, కె.కృష్ణమా చారి, వి.గోవిందరావు, వి.ఆనందరావు, ఎస్.తేజేశ్వరరావు, టి. తిరుపతిరావు, దారపు డిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


జి.సిగడాం: పెనసాంలో పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

అర్హులందరికీ పింఛన్లు: బాబూరావు

పలాస: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సామాజిక పింఛన్లను ప్రభుత్వం అందజేస్తున్నట్లు ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు తెలిపారు. మంగళవారం సాయిబులకాలనీ, సూది కొండకాలనీ, శివాజీనగర్ కాలనీలో పింఛన్లను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు గురిటి సూర్యనారాయణ, లొడగల కామేశ్వర రావుయాదవ్, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్ ఆధ్వర్యంలో ఆయా వార్డుల్లో పింఛన్లను పంపిణీచేశారు.


పొందూరు: పింఛన్ డబ్బులు అందిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్





ఎల్ఎన్‌పేట: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు, కొత్తూరు: మాతలలో కలమట రమణ, పలాసలో బాబూరావు, గార: సైరిగాంలో ఎమ్మెల్యే గొండు శంకర్

సంక్షేమానికి పెద్దపీట : ఎన్ఈఆర్

జి.సిగడాం: కూటమి ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మంగళవారం పెనసాం, బాతువ గ్రామాల్లో పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కుమరాపు రవికుమార్, వజ్జపర్తి రఘురాం, బూరాడ వెంకటరమణ, డబ్బాడ కల్యాణి, కుదిరెళ్ల బుజ్జి తదితరులు పాల్గొన్నారు. అలాగే బాతువలో సర్పంచ్ డబ్బాడ కల్యాణి ఆధ్వర్యంలో స్వచ్ఛతహి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో నిశ్చల, నాయకులు డబ్బాడ ఆదినారాయణ, కూనుబిల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ● **ఎచ్చెర్ల:** ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. అజ్జరాంలో నిర్వహించిన పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బెండు మల్లేశ్వరరావు, బోర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కె.సైరిగాం పంచాయతీలో..

గార: కె.సైరిగాం పంచాయతీలో మంగళవారం ఉదయం ఎమ్మెల్యే గొండు శంకర్ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రెండురోజుల్లోనే పింఛన్ల పంపిణీ : రవికుమార్

పొందూరు: రాష్ట్రంలో సామాజిక పింఛన్ల పంపిణీ రెండు రోజుల్లోనే శతశాతం పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. కేశవదాసుపురం గ్రామంలో మంగళవారం సామాజిక పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో హరిహరరావు, తెలుగునాడు ట్రేడ్‌యూనియన్ జిల్లా అధ్యక్షుడు గాడు నారాయణరావు, నాయకులు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో పారిశుధ్య పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పలాస: హడ్కో కాలనీ శ్మశాన వాటికలో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. గత నెల 30న 'ఆంధ్రజ్యోతి'లో 'అంతిమ' కష్టాలు తీరేదెన్నడో?' అనే శీర్షికన వచ్చిన కథ నంపై మునిసిపల్ అధికారులు స్పందించారు. మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో స్థానిక డేకురు కొండ వద్ద ఉన్న శ్మశానం లో పిచ్చి మొక్కలను తొలగించి అంతిమయాత్రకు వచ్చే వారికి వీలుగా మార్గం ఏర్పాటు చేశారు. శానిటరీ ఇన్ స్పెక్టర్ కల్యాణ శేఖర్ కుమార్ మాట్లాడుతూ.. పట్టణ పరిధిలోని అన్ని శ్మశాన వాటికల్లో పారిశుధ్య పనులు చేపడుతున్నామన్నారు.


హడ్కో కాలనీ శ్మశాన వాటికలో ఎక్స్‌కవేటర్‌తో శుభ్రం చేస్తున్న దృశ్యం

ప్రభుత్వాసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు: డీసీహెచ్ఎస్

నరసన్నపేట: ప్రభుత్వ ఆసుపత్రిల్లో సాధారణ ప్రసవాలను చేపట్టాలని జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త (డీసీహెచ్ఎస్) డా.కల్యాణ్‌బాబు అన్నారు. మంగళవారం స్థానిక సామాజిక ఆసుపత్రిని సందర్శించారు. సిజేరియన్ చేసి ప్రసవాలు చేయడం కంటే సాధారణ ప్రసవం జరిగేందుకు అవకాశాలను పరిశీలించాలన్నారు. అత్యవసర సేవలకు అందుబాటులో ఉండాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసబాబు, స్త్రీవైద్య నిపుణులు జయశ్రీ, ఏవో ఏవీ రమణమూర్తి, వైద్యులు పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణకు దీపారాధన

టెక్కలి: సనాతన ధర్మ పరిరక్షణకు ప్రాయశ్చిత్త దీక్ష పల్లెపల్లెకు తీసుకు వెళ్లాలని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచనల మేరకు మంగళవారం తెలిసీలాపురంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కణితి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో రామాలయంలో దీపారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరుపతి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగంతో గత ప్రభుత్వం హిందువుల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. కార్య క్రమంలో జనసేన నాయకులు చిరంజీవి, షణ్ముఖ రావు, గవరయ్య, కుమారస్వామి, త్రివేణి, హరి, వెంకటరమణ పాల్గొన్నారు.



ప్రముఖ రచయత 'చీకటి' మృతి

పలాస: ప్రముఖ రచయిత, కళాకారుడు, రిటైర్డ్ అధ్యాపకుడు చీకటి కామేశ్వరరావు(82) మంగళవారం మృతి చెందారు. కాశీబుగ్గ తిలక్ నగర్‌లో నివాసం ఉంటున్న ఆయన అనేక కథలు, గేయాలు, కవితలు రాశారు. ఈయన రచించిన అనేక గ్రంథాలు ప్రాచుర్యం పొందాయి. అనేక నాటకాలు, నాటికలు వేశారు. వజ్రపుకొత్తూరు మండలం బైపల్లికి చెందిన ఈయన కాశీబుగ్గలో స్థిరపడ్డారు. భార్య, పిల్లలు ఉన్నారు. కామేశ్వరరావు మృతిపై కవులు, రచయతలు బద్రి కూర్మారావు, వంకల రాజారావు, టి.కృష్ణమూర్తి, కుమార్‌నాయక్ సంతాపం తెలిపారు.


కామేశ్వరరావు(ఫైల్)

తిరుమల బ్రహ్మోత్సవాలకు బోరుభద్ర కోలాట బృందం

సంతబొమ్మాళి: తిరుమలలో ఈనెల 4 నుంచి జరగనున్న బ్రహ్మోత్సవాలకు బోరుభద్ర గ్రామానికి చెందిన శ్రీసాయి గాయిత్రి కోలాట బృందానికి అవకాశం లభించింది. హారిక ఆధ్వర్యంలో బృందంలోని మహిళలు 7న జరుగు బ్రహ్మోత్సవాల్లో ప్రదర్శన ఇవ్వనున్నారు. బ్రహ్మోత్సవాల్లో గ్రామానికి చెందిన బృందానికి అవకాశం రావడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి

పలాసరూరల్: కూటమి ప్రభుత్వం వచ్చి 100 రోజులు పూర్తయిందని, ఎన్నికలకుముందు ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను తక్షణం అమలు చేయాలని సీపీఐఎంఎల్, ఏఐకేఎం, ఏఐఆర్ఎల్ఏ నాయకులు డిమాండ్ చేశారు. మాకన్నపల్లి, బొడ్డపాడు సచివాలయాల ఆవరణలో మంగళవారం నిరసన తెలిపారు. రైతులకు పంట పెట్టుబడులను అందించాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో మూడు నెలలకు సరిపడా రేషన్ సరఫరా చేయాలని, కనీస వేతన చట్టంను అమలు చేయాలని, కౌలురైతులకు గుర్తింపుకార్డులివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు మద్దిల రామారావు, కుత్తుమ దుష్యంత్, కె.లోకనాథం, వంకల అప్పయ్య, కె.ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు దసరా సంబరాలు

పలాస: విజయదశమి సందర్భంగా సత్యసాయి విద్యావిహార్‌లో విద్యార్థులు ముందస్తు సంబరాలు మంగళవారం నిర్వహించారు. దసరా విశిష్టతను చాటి చెబుతూ విద్యార్థినులు చేసిన మహిషాసుర మర్దని నృత్యరూపకం ఆకట్టుకుంది. అంతకు ముందు పాఠశాల విద్యార్థులు రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న యాచకులకు అల్పాహారం అందించారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మహిషాసురమర్దని నృత్యాభినయం చేస్తున్న విద్యార్థినులు


యువత అన్ని రంగాల్లో రాణించాలి

పాతపట్నం: నియోజకవర్గంలోని యువత అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. నీట్ యూజీ ప్రవేశపరీక్ష-2024లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను స్థానిక క్యాంపు కార్యాలయంలో రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. భవిష్యత్‌లోనూ ప్రతిభ కనబరిచిన వారికి తనవంతు సాయం అందిస్తానన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంపీడీవో సలాన చిరంజీవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.కె.చక్రపతి, ఐ.ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

జలుమూరు: దేవీ నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించి గ్రామాల్లో మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. శ్రీముఖలింగేశ్వరాలయంలోని వారాహి అమ్మవారి సన్నిధి, జలుమూరు ఆదిలక్ష్మీ అమ్మవారి సన్నిధిలోనూ శరన్నవ రాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారు రోజుకొక అలంకారం లో దర్శనం ఇవ్వనున్నారని అర్చకులు నారాయణమూర్తి తెలిపారు. ● **నందిగాం:** దేవీ నవరాత్రి ఉత్సవాలకు పలు గ్రామాలు ముస్తాబవు తున్నాయి. నందిగాం, నర్సిపురం, కాపుతెంబూరు, కొత్తగ్రహారం తదితర గ్రామాల్లో మండపాలు సిద్ధం చేస్తున్నారు. గురువారం నుంచి 12వ తేదీ వరకు అమ్మవారికి రోజుకో అలంకరణలో పూజలు చేయనున్నారు.


వారాహి అమ్మవారు


నందిగాంలో ముస్తాబవుతున్న దేవీ మండపం

నేటి నుంచి దసరా సెలవులు

● సెలవుల్లో విద్యార్థులకు ప్రత్యేక టాస్క్

టెక్కలి/జలుమూరు: దసరా సెలవుల సందడి ప్రారంభమైంది. బుధవారం గాంధీ జయంతి కావడంతో మంగళవారం నుంచే విద్యార్థులు ఇళ్లబాట పట్టారు. బుధవారం నుంచి అక్టోబరు 13వ తేదీ వరకు పాఠశాలలకు విద్యాశాఖ సెలవులను ప్రకటించింది. 14న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ మేరకు మంగళవారం పాఠశాలలు, హాస్టళ్ల నుంచి ఇళ్లకు బయలుదేరారు. జిల్లాలో 2,636 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ ఉన్నతపాఠశాలలుండగా 1,71,712 మంది విద్యార్థులు, అలాగే ప్రైవేట్ పాఠశాలల్లో 1,05,075 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇదిలా ఉండగా ఈ సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా విద్యాశాఖ ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించింది. ఎనిమిది రోజులు ప్రతి విద్యార్థి ఏడు సబ్జెక్టుల్లో 70 నుంచి 80 ప్రశ్నలకు జవాబులు నేర్చుకునేలా ఎసైన్‌మెంట్ తయారు చేసినట్లు డీఈవో తిరుమల చైతన్య తెలిపారు. దసరా మూడురోజులు పండగ మినహాయిస్తే మిగిలిన రోజులు విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ఈ టాస్క్ ఇచ్చామన్నారు. దీనివల్ల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.



జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకులంలో విద్యార్థినులు వేసిన అమ్మవారి చిత్రం

ఉత్సాహంగా సాగిన సాఫ్ట్ టెన్నిస్ క్రీడా పోటీలు

పాతపట్నం: స్థానిక ఎన్టీఆర్ గ్రీన్‌ఫీల్డ్ క్రీడా మైదానంలో జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి బీవీ రమణ పర్యవేక్షణలో మంగళవారం జిల్లా స్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలు జరిగాయి. ఈ పోటీలు అండర్-14, 17, 19 బాలబాలికల విభాగాల్లో నిర్వహించగా క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇక్కడ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన క్రీడాకారులు త్వరలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.అప్పన్న తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి యెన్ని శేఖర్‌బాబు, జె.కృష్ణారావు, కె.రాజారావు, స్కూల్ ప్రిన్సిపాల్ కేవీ రత్నకుమారి పర్యవేక్షించారు.

బాల్ బాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ

కాశీబుగ్గ: హర్యానా రాష్ట్రంలో ఇటీవల జరిగిన 43వ సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ జాతీయ స్థాయి పోటీల్లో పలాసకు చెందిన జి.ఛాయాకిరణ్ ప్రథమ స్థానం పొందాడని సంఘం జిల్లా అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం గోల్డ్ మెడల్ అందించి అభినందించారు. బాల్ బ్యాడ్మింటన్ అంతర్జాతీయ పోటీల్లోనే రాణించేలా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పేట విద్యార్థులు

నరసన్నపేట: జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో సత్యవరం, దేశవానిపేట పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎంలు తెలిపారు. 200 మీటర్ల పరుగు పందెంలో డి.లక్ష్మణ, లాంగ్ జంప్‌లో బి.హారిక, దేశవానిపేట పాఠశాలకు చెందిన రవికుమార్ బేస్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎంలు ఓకులాదేవి, జయరావు పేర్కొన్నారు. తెలిపారు.

గంగివలస కేజీబీవీ విద్యార్థినులు..

గంగివలస (పోలాకి): స్కూల్ గేమ్స్ హాకీ, నెట్‌బాల్, రగ్బీ, చెస్ పోటీల్లో గంగివలస కేజీబీవీ నుండి 13 మంది బాలికలు ఎంపికైనట్లు సంక్షేమాధికారి శారద, పీఈటీ ప్రియాంక తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వీరంతా రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవుతారన్నారు. అలాగే దీర్ఘాశి ఉన్నతపాఠశాల నుంచి వాలీబాల్‌లో జనాపూజిత, బోర యశస్విని రగ్బీలో ఇరువురు బాలికలు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం ఎస్.శ్రీనివాస రెడ్డి, పీఈటీ జి.ఉషారాణి తెలిపారు. విద్యార్థినులను వారు అభినందించారు.

మద్యం షాపుల కార్మికుల ఆందోళన

నరసన్నపేట: పట్టణంలో ప్రభుత్వ మద్యం షాపులను మూసివేసి సిబ్బంది మంగవారం ఆందోళన చేపట్టారు. గత నెల 30వ తేదీతో తమ ఒప్పందం ముగిసిందని, అయితే ప్రభుత్వం నుంచి ఎటువంటి హామీ రాకపోవడంతో దుకాణాలను మూసివేసి నిరసన తెలిపినట్లు సేల్స్ మెన్లు, సూపర్‌వైజర్లు తెలిపారు. నరసన్నపేట ఎక్సైజ్‌శాఖ పరిధిలో 14 షాపులు మూతపడ్డాయి. ఎక్సైజ్‌శాఖ అధికారులు బలవంతంగా తీయించేందుకు ప్రయత్నించారు. అయినా షాపులు సాయంత్రం వరకు తెరవకపోవడంతో ఎక్సైజ్‌శాఖ అధికారులు కొన్ని షాపులను సిబ్బందితో తీయించి విక్రయాలు చేపట్టారు.

దసరా సెలవుల్లో మరమ్మతులు చేపట్టండి


హెచ్ఎంకు సూచనలిస్తున్న ఐటీడీఏ ఏపీవో

జలుమూరు (సారవకోట): పాఠశాల మరమ్మతులు దసరా సెలవుల్లో పూర్తి చేయాలని ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు అన్నారు. సవరబొంతు ఆశ్రమ పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. పాడైన తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'టీడీపీ నేతల కనుసన్నల్లోనే ఇసుక విధానం'

కొత్తూరు: రాష్ట్ర ప్రభుత్వ ఉచిత ఇసుక విధానం అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే జరుగుతోందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శిర్ల ప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పేదలు ఇళ్ల నిర్మాణానికి ఉచిత ఇసుక అందిస్తామని చెప్పిన ప్రభుత్వం నేడు ఇసుక మాఫియాకు అండగా ఉంటోందని విమర్శించారు. ఇసుక అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణను అలవరచుకోవాలి

ఈదులవలస (పోలాకి): విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి అన్నారు. ఈదులవలస మోడల్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ, విద్యాకమిటీ చైర్మన్ ఎర్రయ్య కూటమి నాయకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

కొత్తూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ప్రిన్సిపాల్ బందారు రవికుమార్ మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు చేపట్టారు.

దేశభక్తిని పెంపొందించుకోవాలి

మెళియాపుట్టి: ప్రతి ఒక్కరు దేశభక్తిని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. మంగళవారం సవరముకుందపురంలో మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గిరిజన ప్రాంతాల్లో దేశ నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.హనుమంతురావు, ఎంపీడీవో చంద్రకుమారి, ఎంఈవోలు దేవేంద్రరావు, మల్లారెడ్డి, పద్మనాభం, టీడీపీ నాయకులు ఎస్.మోహనరావు పాల్గొన్నారు.

జనసేన జెండా ఆవిష్కరణ

వజ్రపుకొత్తూరు: ఉద్దానం గోపినాథపురంలో జనసేన పార్టీ జెండాను ఆపార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వి.దుర్గారావు మంగళవారం ఆవిష్కరించారు. ప్రజల ఆకాంక్ష మేరకు పాలనసాగుతోందన్నారు. జోగారావు, జనసైనికులు పాల్గొన్నారు.

కేసు నమోదు

పాతపట్నం: అచ్యుతాపురం కూడలిలో మంగళవారం నిర్వహించిన వాహనాల తనిఖీలో గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ ఎన్.సాయి, ఎస్ఐ బి.లావణ్య తెలిపారు. నిందితుడి నుంచి 1170 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యాంత్రీకరణతో అధిక దిగుబడి

నరసన్నపేట: వ్యవసాయంలో యంత్రీకరణ విధానాలతో అధిక దిగుబడి సాధించవచ్చని ఏడీఏ రవీంద్రభారతి అన్నారు. మంగళవారం నరసన్నపేట రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. చీడలు, తెగుళ్ల యాంత్రీకరణ విధానాలతో నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏవో సునీత, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు. ● **తురకపేట(ఎల్.ఎన్.పేట):** వరి పంటలకు సోకే తెగుళ్ల నివారణకు క్రిమిసంహారక మందులతో నివారిచడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని ఏవో పి.లత్శాశ్రీ తెలిపారు. తురకపేటలో మంగళవారం రైతులతో పొలం పిలుస్తోంది నిర్వహించారు. సర్పంచ్ ఎం.యోగీశ్వరి, ఎంపీటీసీ పి.జయలక్ష్మి, రెవెన్యూ కార్యదర్శి జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు. ● **మెళియాపుట్టి:** వరి పంటపై దోమపోటు సోకే ప్రమాదం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో దానకర్ణుడు తెలిపారు. మంగళవారం వెంకటాపురం, మర్రిపిడు-సి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం సుడిదోమ, కుళ్ల తెగులు, అగ్గి తెగులు వచ్చే ప్రమాదం ఉందని రైతులు గమనించి మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. కూటమి నాయకులు దినకర్‌రావు, దుక్క బాలరాజు పాల్గొన్నారు. ● **నందిగాం:** పంటల సాగులో సస్యరక్షణ పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి శ్రీకాంత్‌వర్మ అన్నారు. మంగళవారం కాపుతెంబూరు, పెద్దలవునిపల్లిల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరిలో దోమ తెగులు ఆశించినందున ఎస్సెట్ అనే మందు ఎకరాకు 400 గ్రాములు పిచికారీ చేయాలని సూచించారు. ఇ-క్రాప్ పూర్తయిన రైతులు ఈకేవైసీ చేయించు కోవాలని కోరారు. కొల్లి హరిబాబు, శ్రీరాములు, రాణి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


దుర్గారావు (ఫైల్)

పొందూరు: తండ్యాం పంచాయతీ గూనానిపేటకు చెందిన కుమరాపు దుర్గారావు(28) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వ్యక్తిగత కారణాలతో రెండురోజుల కిందట ఇంటిలో ఉన్న పురుగుల మందు తాగి అస్వస్థతకు గురైన దుర్గారావును కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స కోసం చేర్పించారు. అక్కడ చికిత్స పొందూరు సోమవారం మృతి చెందాడు. రిమ్స్‌లో పోస్టుమార్టం నిర్వహించారు. అతడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేశారు. కాగా దుర్గారావు జనసేన పార్టీలో క్రియాశీలక సభ్యుడిగా పనిచేసేవాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

టెక్కలి: జాతీయ రహదారి గొల్లూరు సమీపంలో మంగవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెంటూరు గ్రామానికి చెందిన ననపల గోవింద్, ప్రగడ బాలకృష్ణ ద్విచక్ర వాహనంపై మంగళవారం ఉదయం టెక్కలి వైపు వస్తుండగా వెనుక నుంచి వస్తున్న ఓ కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ఇదే సమయంలో వెనుక నుంచి వస్తున్న లారీ కారును ఢీకొట్టింది. దీంతో కారు వెనుక భాగంగా నుజ్జయింది. అదే సమయంలో అటుగా వస్తున్న టెక్కలి నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి పేడాడ తిలక్ క్షతగాత్రులను హుటాహుటిన టెక్కలిలోని జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రావివలస జంక్షన్ సమీపంలో ఒకరికి..

టెక్కలి: నౌపడా-మెళియాపుట్టి మార్గంలో రావివలస జంక్షన్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడ్డాడు. తేలినీలాపురానికి చెందిన వి.దుష్యంత్ టెక్కలి నుంచి స్వగ్రామానికి వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బస్సు ఢీకొనడంతో దుష్యంత్‌కు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గర్భిణిపై దాడి.. కేసు నమోదు

టెక్కలి: రావివలసలో రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణతో ఓ గర్భిణిపై మరో కుటుంబం దాడి చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రావివలస పాతకాలనీకి చెందిన బి.శేఖర్, లక్ష్మి, శేఖర్ సోదరుడిపై అదే వీధికి చెందిన వేరే కుటుంబం మధ్య స్వల్పఘర్షణ జరగడంతో చివరకు కొట్లాటకు దారితీసింది. దీంతో గాయపడిన శేఖర్, లక్ష్మిలను జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఈ దాడిలో గాయపడిన లక్ష్మి నాలుగు నెలల గర్భిణి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అందరూ చూస్తుండగానే..

● బైక్‌పై వచ్చి మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

పలాస: జనమంతా చూస్తుండగానే కాశీబుగ్గకు చెందిన చిత్తరెడ్డి సంతోషి మెడలోని పుస్తెలతాడును ఇద్దరు ఆగంతకులు బైక్‌పై వచ్చి చోరీ చేసిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వెంటనే స్థానికులు బైక్‌ను అనుసరించినా వారు స్పీడ్‌గా వెళ్లిపోవడంతో పట్టుకోలేకపోయారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సంతోషి స్థానిక అన్నపూర్ణ థియేటర్ రోడ్డులో ఉన్న జీడి పరిశ్రమలో పనిచేస్తోంది. విధులు ముగించుకొని సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో ఇంటికి కాలినడకన వస్తుండగా.. కేటీ రోడ్డు ఎస్ఆర్ షాపింగ్ మాల్ దాటిన తరువాత ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ముసుగు ధరించి ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలో పుస్తెలతాడును లాక్కెళ్లారు. ఆమె వెంటనే తేరుకొని తాడు కింద ఉన్న పుస్తెలను గట్టిగా పట్టుకోవడంతో అవి చేతిలో ఉండిపోయాయి. మిగిలిన 20 గ్రాముల బంగారం తాడు చోరీకి గురైంది. ఆమె కేకలు వేయగా స్థానికులు వారిని వెంబడించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఐ డి.మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెండిగేటు కూడలి వద్ద..

వజ్రపుకొత్తూరు: ఉద్దానం మెళియాపుట్టికి చెందిన బొమ్మాళి సరోజనమ్మ మెడలోని బంగారం గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు లాక్కొని వెళ్లిపోయినట్లు ఏఎస్ఐ జూన్నారావు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. మంగళవారం ఉదయం ఉద్దానం మెళియాపుట్టి నుంచి పలాస మండలం గరుడిఖండికి బొమ్మాళి లక్ష్మయ్య, భార్య సరోజనమ్మ ద్విచక్ర వాహనంపై వెళుతుండగా బెండిగేటు కూడలి వద్ద గుర్తుతెలియని యువకుడు ఆమె మెడలోని సుమారు తులంన్నర బంగారం చైన్‌ను తెంపుకొని వెళ్లిపోయాడు. వెంటనే అతడి కోసం చుట్టుపక్కల వారు గాలించినా అప్పటికే పరారయ్యాడు. ఈ ఘటనపై బాధితురాలు సరోజనమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.

కొర్లాం వద్ద హైవేపై..

సోంపేట: కొర్లాం హైవే వద్ద ఓ మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు మూడు తులాల బంగారు గొలుసును అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొర్లాం గ్రామానికి చెందిన కె.పుణ్యావతి మంగళవారం పొలం పనులు ముగించుకొని ఇంటికి వస్తుంది. ఆ సమయంలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసు అపహరించుకుపోయారు. బాధితురాలు పుణ్యావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సోంపేట సీఐ మంగరాజు తెలిపారు.

ఒక్కరోజు నిలిచిన మద్యం విక్రయాలు

● దుకాణాలు మూసివేసి నిరసన వ్యక్తంచేసిన సిబ్బంది

శ్రీకాకుళం, (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ సర్కారు ప్రభుత్వ మద్యం దుకాణాలను ఏర్పాటుచేసి.. అన్ని దుకాణాల్లో సిబ్బందిని నియమించింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం.. పాతపద్ధతి తొలగించి దుకాణాల నిర్వహణ బాధ్యత ప్రైవేటుకే కేటాయించేలా నిర్ణయం తీసుకుంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ దుకాణాల ఏర్పాటుకు నోటిఫికేషన్ కూడా జారీ చేసేసింది. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం దుకాణాల్లో ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా సూపర్ వైజర్లను, సేల్స్‌మెన్లను నియమించుకున్నారు. వాళ్లందరూ.. రాష్ట్ర యూనియన్ మేరకు మంగళవారం నిరసన చేపట్టారు. ప్రభుత్వ మద్యం దుకాణాలను తెరవనీయకుండా సమ్మె కొనసాగించారు. ప్రైవేటు దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల తాము రోడ్డున పడతామని, తమ భవిష్యత్తు విషయంపై ప్రభుత్వం ప్రకటించాలంటూ ఆందోళన చేపట్టారు. అయితే ఎక్సైజ్ అధికారులు రంగంలోకి దిగి.. రాత్రి 9 గంటల్లోగా దుకాణాలు తెరిచేలా ప్రయత్నాలు చేపట్టారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణకు చర్యలు చేపట్టాలి

అరసవల్లి: ఆంధ్రుల ఆత్మ బలిదానాలతో సాధించిన విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు చేపట్టాలని అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఏడు రోడ్ల జంక్షన్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలో ఆయా సంఘాల నాయకులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, కె.నాగమణి, షన్ముఖరావు, రౌతు శంకరరావు, కె.శ్రీనివాస్, అల్లు మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రయత్నాలు ఆపాలని ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐవైఎఫ్ సంఘాల ప్రతినిధులు కలెక్టరేట్ వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. ఆయా సంఘాల నాయకులు ఎం.యుగంధర్, కొన్న శ్రీనివాసరావు, సీహెచ్ రవి, కూర్మారావు, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

మంచి డ్రైవర్లుగా గుర్తింపు పొందాలి

అరసవల్లి: ఏపీఎస్ ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 16వ బ్యాచ్ డ్రైవర్లకు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయకుమార్ మంగళవారం సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ తీసుకున్న ప్రతీ ఒక్కరు మంచి డ్రైవర్లుగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. అలాగే ఈ నెల 4న మరో బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభమవుతుందని, లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్, ఒక సంవత్సరం అనుభవం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 79897 23505, 73829 23293 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఈకేవైసీ చేయించుకోవాలి


గార: ప్రతీ రైతు తప్పనిసరిగా ఈ నెల మూడో తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కె.త్రినాథస్వామి అన్నారు. మంగళవారం ఉదయం బూరవెల్లి, పూసర్లపాడు గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోందిలో పాల్గొన్న ఆయన రైతులకు పలు సూచనలు చేశారు.

● **బూర్జ:** తోటవాడ, పీఎల్ దేవిపేట గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోందిలో జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి, అగ్రోనామి ఏడీఏ భవానీ శంకర్ పాల్గొన్నారు.

● **ఆమదాలవలస:** యాజమాన్య పద్ధతులతో మేలైన పంట దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయశాఖ ఏడీ బి.రజని అన్నారు. నిమ్మతొర్లాడ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

మహాత్ముడికి మందిరం

శ్రీకాకుళం కల్చరల్/ అర్బన్: బాపు నడిచిన బాటను అందరికీ పరిచయం చేయాలని, ఆయన పోరాటపటిమను నేటి తరానికి తెలియజేయాలనే సంకల్పంతో శ్రీకాకుళంలో ఏకంగా మహాత్మునికి గుడి కట్టించారు. నగరంలోని శాంతినగర్ కాలనీలో స్మారకనిధి పేరిట ఓ కమిటీని ఏర్పాటు చేసి స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనాన్ని ఏర్పాటు చేశారు. 2021 జనవరి 30న గాంధీ గుడిని ప్రారంభించారు. అలాగే జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, అల్లూరి సీతారామరాజు, లాల్ బహదూర్ శాస్త్రి తదితర విగ్రహాలతో పాటు సంఘ సంస్కర్తలైన స్వామి వివేకానంద, గురజాడ అప్పారావు, పింగలి వెంకయ్య, మదర్ థెరిసా, మౌలానా అజాద్, భగత్‌సింగ్ తదితర విగ్రహాలను ఏర్పాటుచేశారు. ఇక్కడే 105 అడుగుల ఎత్తులో జాతీయ జెండాను ఏర్పాటు చేశారు. ఈ శాంతి మందిరాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తే మంచిదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.


టెక్కలిలో గాంధీ గుడి



శ్రీకాకుళం నగరం శాంతినగర్ కాలనీలో గాంధీ మందిరం

టెక్కలిలో..

టెక్కలి: మేజర్ పంచాయతీ టెక్కలి దిగువ కండ్రవీధిలో బెనియా రామచందర్ ఐదు దశాబ్దాల కిందట జాతిపిత మహాత్మా గాంధీకి గుడి కట్టించాడు. నిత్య పూజలు చేస్తుంటారు. తన పిల్లల పేర్లకు చివరన గాంధీ ఉండేటట్టు నామకరణం చేసి తన దేశభక్తిని చాటుకున్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

గార: ప్రతీ ఒక్కరూ మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. వమరవల్లి డైట్‌లో మంగళవారం వనం - మనం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన డైట్ ఆవరణలో మొక్కలు నాటారు. డైట్ అధ్యాపకులు విద్యార్థులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

పొందూరు ఎక్సైజ్ సీఐగా రాజు

పొందూరు: మండల ఎక్సైజ్ సీఐగా వై.రాజు మంగళవారం విధుల్లో చేరారు. అల్లూరి జిల్లా చింతపల్లిలో సీఐగా పనిచేస్తున్న రాజు ఇక్కడికి బదిలీపై వచ్చారు. కాగా ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేయడంతో మంగళవారం దుకాణాలు తెరవలేదు. పలు దుకాణాలను సీఐ సిబ్బందితో కలసి పరిశీలించారు.

16 మంది తహసీల్దార్ల బదిలీ

శ్రీకాకుళం కలెక్టరేట్: జిల్లాలో 16 మంది తహసీల్దార్లకు బదిలీ అయింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వారికి కేటాయించిన స్థానాల వారీగా..

పేరు	బదిలీ అయిన ప్రాంతం
బి.పాపారావు తహసీల్దార్, కొత్తూరు	తహసీల్దార్, మెళియాపుట్టి
ఎస్.హనుమంతరావు, తహసీల్దార్, మెళియాపుట్టి	హెచ్-సెక్షన్ సూపరింటెండెంట్ (తహసీల్దార్ కేడర్), కలెక్టరేట్
బి.రాజేశ్వరరావు, సీ-సెక్షన్ సూపరింటెండెంట్, కలెక్టరేట్	డీఏవో, టెక్కలి
డి.రమణమూర్తి, డీ-సెక్షన్ సూపరింటెండెంట్, కలెక్టరేట్	తహసీల్దారు, టెక్కలి
బి.ప్రకాశరావు, హెచ్-సెక్షన్ సూపరింటెండెంట్, కలెక్టరేట్	డీఏవో, పలాస
జి.ప్రభాకరరాజు, డీఏవో, టెక్కలి	సీ-సెక్షన్ సూపరింటెండెంట్, కలెక్టరేట్
బీఎస్ఎస్ సత్యనారాయణ, తహసీల్దార్, టెక్కలి	డీ-సెక్షన్ సూపరింటెండెంట్, కలెక్టరేట్
ఎస్.హైమవతి, డీఏవో, పలాస	తహసీల్దార్, మందస
ఎస్.రమేష్‌కుమార్, తహసీల్దార్, పొందూరు	తహసీల్దార్, కంచిలి
కె.రవిచంద్ర, తహసీల్దార్, అండర్ వెయిటింగ్	తహసీల్దార్, హిరమండలం
డి.సీతారామయ్య, తహసీల్దార్, పార్వతీపురం మన్యం	తహసీల్దార్, వజ్రపుకొత్తూరు
పి.సోమేశ్వరరావు, తహసీల్దార్, రీ అలాటెడ్, మన్యం జిల్లా	తహసీల్దార్, నందిగాం
ఆర్.రమేష్‌కుమార్, తహసీల్దార్, రీ అలాటెడ్, మన్యం జిల్లా	తహసీల్దార్, సంతబొమ్మాళి
టి.కల్యాణ్ చక్రవర్తి, తహసీల్దార్, విజయనగరం జిల్లా	తహసీల్దార్, పలాస
వైవీ పద్మావతి, తహసీల్దార్, ఎల్ఎన్ పేట	తహసీల్దార్, బూర్జ
జె.ఈశ్వరమ్మ, తహసీల్దార్, బూర్జ	తహసీల్దార్, ఎల్ఎన్ పేట

పారామెడికల్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

అరసవల్లి: శ్రీకాకుళంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో పారామెడికల్ డిప్లొమా కోర్సు 2024-25 బ్యాచ్‌కు సంబంధించి సెప్టెంబరు 30వ తేదీ నాటికి మిగిలిన సీట్లకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులను సంబంధిత వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తి చేసి అక్టోబరు 10వ తేదీలోగా, ప్రిన్సిపాల్, ప్రభుత్వ వైద్య కళాశాల, శ్రీకాకుళం కార్యాలయంలో వ్యక్తిగతంగా సమర్పించాలన్నారు. కార్యాలయంలో కోర్సు సీట్ల ఖాళీల జాబితా అందుబాటులో ఉందని, మెరిట్ ప్రకారం ప్రవేశాలు ఉంటాయన్నారు. సీటు కేటాయించిన అభ్యర్థులు రుసుమును అదే రోజు చెల్లించాలని తెలిపారు.

స్వర్ణాంధ్ర సాధనలో భాగస్వాములు కావాలి

శ్రీకాకుళం కలెక్టరేట్: స్వర్ణాంధ్ర విజన్ రూపకల్పన, సాధనలో ప్రజలందరూ భాగస్వాములై తమ అభిప్రాయాలను తెలపాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. స్వర్ణాంధ్ర- 2047 విజన్ ప్రణాళికను రూపొందించడంలో రాష్ట్రంలోనే శ్రీకాకుళం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని, ఇంకా సమయం ఉన్నందున స్వర్ణాంధ్ర సాధనకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి రెవెన్యూ ఫ్రీహోల్డ్ సర్వే, కోర్టు కేసులు, రీ ఓపెన్ గ్రీవెన్స్, ఓటర్ల జాబితా రూపకల్పన, స్వచ్ఛతా సేవ, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, ఉపాధి హామీ పనులు, 100 రోజుల ప్రగతి తదితర అంశాలపై జిల్లా అధికారులు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్వో అప్పారావు, ఆర్డీవోలు భత్‌నాయక్, సీపీవో ప్రసన్నలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, నోడల్ అధికారి వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం


కోర్టు ఆవరణను శుభ్రపరుస్తున్న న్యాయాధికారి జ్యోత్స్న

పొందూరు: పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని పొందూరు జూనియర్ సివిల్‌కోర్టు న్యాయాధికారి బి.జ్యోత్స్న అన్నారు. స్వచ్ఛత సేవా హి కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో కోర్టు ఆవరణ, మంగళవారం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. న్యాయాధికారి బి.జ్యోత్స్న స్వయంగా చీపురు పట్టి కోర్టు ఆవరణ శుభ్రపరిచారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పొందూరులోని పోస్టుమెట్రిక్ బాలికల వసతిగృహంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. బార్ అసోసియేషన్ సభ్యులు, మేట్రిన్ శ్రీదేవి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన న్యాయాధికారి


పండ్లు అందిస్తున్న న్యాయాధికారి

శ్రీకాకుళం స్పోర్ట్స్: ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ఖ్యాతి వృద్ధాశ్రమానికి సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా న్యాయశాఖ అధికారి సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు సందర్శించారు. వృద్ధులను ఆప్యాయంగా పలకరించి వారు ప్రయాణం చేసేటప్పుడు రాయితీ, పింఛన్లు, ఉచిత వైద్యంపై చర్చించారు. తర్వాత అదరికీ పండ్లను అందజేశారు. న్యాయవాది జి.ఇందిరా ప్రసాద్ పాల్గొన్నారు.

వృద్ధులకు సన్మానం


వృద్ధులను సన్మానిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: పట్టణంలోని 13వ వార్డు విద్యానగర్‌లో మంగళవారం ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతాసాగర్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. టీడీపీ న్యాయ విభాగ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ వార్డుల్లో ఉన్న పలువురు వృద్ధులకు శాలువతో సత్కరించి ఘనంగా సన్మానించారు.

ఇసుక ర్యాంప్ పరిశీలించిన జేసీ


ఇసుక ర్యాంప్‌లో రికార్డులు పరిశీలిస్తున్న జేసీ

బూర్జ: కాఖండ్యాం ఇసుక ర్యాంప్‌ను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మంగళవారం పరిశీలించారు. తహసీల్దార్ ఈశ్వరమ్మతో కలిసి పరిశీలించారు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇసుక అక్రమ తరలింపు జరుగుతుందని వచ్చిన ఫిర్యాదు మేరకు సందర్శించారు. ప్రభుత్వ అనుమతులు మేరకే ఇసుకను రవాణా చేయాలని సూచించారు.

టీఎన్‌టీయూసీ నేతకు ఆర్థిక సాయం

అరసవల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న టీఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి కోల శ్రీనివాస్‌కి చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే గొండు శంకర్ రూ.2లక్షలు సాయాన్ని అందజేశారు. మంగళవారం శ్రీనివాస్ ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే పరామర్శించి, మొత్తాన్ని అందజేశారు. ఏ అవసరం వచ్చినా పార్టీ తరఫున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గిల్టునగల ఉదంతంపై పోలీసులను ఆశ్రయించిన బ్యాంకు సిబ్బంది

శ్రీకాకుళం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని సింహద్వారం వద్ద ఉన్న వెంకటాపురం వద్ద ఓ బ్యాంక్‌లో గిల్టునగలుతో రుణాలు పొందిన ఉదంతాన్ని 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. మంగళవారం 'గిల్టునగలతో రుణాలు' అనే శీర్షికతో కథనం ప్రచురించడంతో ఇంతవరకు గోప్యత పాటించిన బ్యాంకు సిబ్బంది.. మంగళవారం సాయంత్రం మౌనం వీడారు. గిల్టునగలుతో రుణాలు పొందేందుకు కారణమైన గోల్డ్ అప్రైజర్‌పై ఫిర్యాదు చేసేందుకు బ్యాంకు మేనేజర్, బ్యాంకు సిబ్బంది ఎచ్చెర్ల పోలీసు స్టేషన్‌కు మంగళవారం రాత్రి వెళ్లారు. కోటబొమ్మాళిలో జరుగుతున్న కొత్తమ్మతల్లి ఉత్సవాల బందోబస్తుకు అధిక మంది సిబ్బంది వెళ్లడంతో బుధవారం రావాలని పోలీసులు బ్యాంకు అధికారులకు చెప్పారు. దీంతో తమ వెంట తీసుకువచ్చిన ఆధారాలతో బ్యాంకు అధికారులు వెనక్కి వెళ్లిపోయారు. పూర్తిస్థాయి ఆధారాలతో బుధవారం ఫిర్యాదు చేయనున్నారు.

సమస్యలు పరిష్కరించండి


కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు పరిష్కారానికి చొరవచూపాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ కోరారు. ఈ మేరకు మంగళవారం శ్రీకాకుళంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతి పత్రం అందించారు. కొబ్బరి రైతులకు ఆదుకునేందుకు ప్రత్యేక ప్యాకేజీ ద్వారా నిధులు వచ్చేలా, బెంతుఒరియాలకు నేటివిటీ సర్టిఫికెట్లు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కిడ్నీ రోగులకు డయాలసిస్ కేంద్రాల్లో బెడ్లు సంఖ్య పెంచాలని, ఇచ్ఛాపురంలో డయాలసిస్ యూనిట్, బాహుదానదిలో ప్రధాన కాలువలు మెరుగుపరిచేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

విజయవాడ వరద బాధితులకు సాయం

ఇచ్ఛాపురం: విజయవాడ వరద బాధితులకు ఇచ్ఛాపురం నియోజకవర్గ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, మండలం, కవిటి, కంచిలి, సోంపేట) లక్షా నాలుగు వేలు విరాళం ఇచ్చింది. ఈ మేరకు మంగళవారం రామయ్యపుట్టుగ ఎమ్మెల్యే బెందాళం అశోక్ కార్యాలయంలో చెక్‌ను అసోసియేషన్ ప్రతినిధులు అందజేశారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దక్కత కృష్ణమూర్తి రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు చాట్ల తులసీదాస్‌రెడ్డి, కార్యదర్శి కోట రామారావు, మండలాధ్యక్షులు పల్లంటి చిరంజీవి, కార్యదర్శి మార్కెండేయులు పాల్గొన్నారు

కంచిలి రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయాలి

కంచిలి: పెద్ద శ్రీరాంపురం పంచాయతీ పరిధిలో గల బీఎస్ఎన్ఎల్ టవర్ పనులు వేగవంతం చేయాలని, కంచిలి రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయాలని మండల నాయకులు కోరారు. ఈ మేరకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు మంగళవారం కలిశారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు మాదిన రామారావు, బి హరిబాబు, ప్రదీప్ పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు

అరసవల్లి: అనారోగ్య సమ స్యలు ఏమైనా ఉంటే పీహెచ్‌సీని సంప్రదించాలని, అవసరమైన మందులు ఉచితంగా పొంద వచ్చని డీఎంహెచ్‌వో బి.మీనాక్షి అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా వైద్యా రోగ్యశాఖ 10 రోజుల పాటు నిర్వహిస్తున్న వైద్య పరీక్షల్లో భాగంగా మంగళవారం స్థానిక మిషనరీస్ ఆఫ్ చారిటీ మదర్ థెరిస్సా ఆశ్రమంలో నిర్వహించారు. వైద్యులు కె.వెంకటరమణ, కల్యాణ్‌బాబు, కె.శేషగిరి, కె.విజయశేఖర్, లక్ష్మి పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-2047లో సత్తాచాటిన రత్తకన్న విద్యార్థి


ప్రేమ్‌కుమార్‌ను అభినందిస్తున్న ఎంఈవో

ఇచ్ఛాపురం: రత్తకన్న వినాయక విద్యానికేతన్ పాఠశాల పదో తరగతి విద్యార్థి జి.ప్రేమ్‌కుమార్ స్వర్ణాంధ్ర-2047లో భాగంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో సత్తాచాటాడు. ఇచ్ఛాపురం బాలికోన్నత పాఠశాలలో స్వర్ణాంధ్ర-2047లో భాగంగా ఎంఈవో కె.అప్పారావు ఆధ్వర్యంలో మండల స్థాయిలో డిబేట్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొనగా ప్రేమ్‌కుమార్ విజేతగా నిలిచాడు. ఇక్కడ సత్తాచాటిన విద్యార్థులు జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో పాల్గొంటారని ఎంఈవో తెలిపారు. ప్రేమ్‌కుమార్‌కు మెమెంటో అందజేసి అభినందించారు.

బీచ్‌లో స్వచ్ఛతా హి సేవా


స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

గార: కె.మత్స్యలేశం బీచ్‌లో మంగళవారం స్వచ్ఛ హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఆర్.వెంకటరామన్, డీపీవో వెంకటేశ్వరరావు, డీటీవో ఎన్.నారాయణరావు, ఎంపీడీవో ఎస్.రామమోహనరావు, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ రాము ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

లావేరు: మురపాక కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్టు స్థానిక పాఠశాల ప్రత్యేకాధికారిణి బి.సుధ తెలిపారు. ఈ నెల 1న జిల్లా స్థాయిలో జరిగిన అండర్-19 త్రోబాల్ పోటీల్లో తమ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న జె.యమున, డి.శాంతి సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు.

● **రణస్థలం:** ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన క్రీడా పోటీల్లో కొచ్చెర్ల జడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. బి.రేవతి వాలీబాల్, బి.మోహన్ క్రికెట్, జె.భవానీ ఖోఖో, కె.విమల ఖోఖో, కె.భూలక్ష్మి ఖోఖో పోటీలకు ఎంపికవ్వడంపై హెచ్ఎం కిల్లి తిరుపతిరావు అభినందించారు.

● **కవిటి:** రాజపురంలోని ఆదర్శపాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరు గుతున్న పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఈశ్వరరావు తెలిపారు. అండర్-14 బాలికల విభాగంలో డి.హారిక, అండర్-17లో ఎస్.పార్వతి, డి.యమున, అండర్-19లో జి.కల్పన, జయం తి, యాన్నలు, బాలుర విభాగంలో సంతోష్, సంజయ్‌లు వాలీబాల్ విభాగంలో ఎంపికయ్యారని చెప్పారు.

అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా జట్టు ఖరారు

శ్రీకాకుళం స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా జట్టును ఖరారు చేశారు. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు రాజమండ్రిలో జరగనున్న రాష్ట్ర స్థాయి సౌత్‌జోన్ పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొన్న మధుసూదనరావు, ఎం.సాంబమూర్తి తెలిపారు.

● గత పదిహేను రోజులుగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఎంపికలు మంగళవారంతో ముగిశాయి. 35 క్రీడాంశాల్లో అండర్-14, 17, 19 విభాగాల్లో సుమారు 6000 మంది క్రీడాకారులు ఎంపికల్లో పాల్గొన్నారు. ఇందులో 1400 మంది క్రీడాకారులు వివిధ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

ఎక్సైజ్ మంత్రిని కలసిన 'విభూది'

అరసవల్లి: ఎక్సైజ్, భూగర్భ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రను మంగళవారం శ్రీకాకుళం జిల్లాకు చెందిన టీడీపీ జంగమ సాధికారిత రాష్ట్ర డైరెక్టర్ విభూది సూరిబాబు కలుసుకున్నారు. ఇటీవల కొత్త మద్యం పాలసీని ప్రకటించడంతోపాటుగా... గత ప్రభుత్వ విధానాలకు స్వస్తి పలకడంతో మంత్రిని కలసి అభినందించారు.

దసరా సెలవులు పాటించాలి

అరసవల్లి: అన్ని పాఠశాలలు దసరా సెలవులు కచ్చితంగా పాటించాల్సిందేనని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల యాజమాన్యాలు ఈ నెల 3 వతేదీ నుంచి 13 వరకు కచ్చితంగా పాటించాలని అన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

ఎచ్చెర్ల: వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. విద్యార్థుల కేరింతలు కొడుతూ సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల డైరెక్టర్ బుడుమూరు శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ.. విద్యార్థులు స్నేహపూర్వ వాతావరణంలో పోటీతత్వంతో చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో యాజమాన్య ప్రతినిధులు ఇప్పిలి కిశోర్, రఘు కార్తీక్, ప్రిన్సిపాల్ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేశారు.

బీజేపీ బలోపేతానికి కృషి

ఇచ్ఛాపురం: బీజేపీని పూర్తిస్థాయిలో బలోపేతానికి కృషి చేస్తున్నామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుద్దాల నిర్మలారెడ్డి తెలిపారు. మంగళవారం మునిసిపాలిటీ పరిధిలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తీరాన్ని శుభ్రం చేసిన విద్యార్థులు

ఎచ్చెర్ల: శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం) విద్యార్థులు గాంధీజీ జయంతి సందర్భంగా మంగవారం బుడగట్లపాలెం తీరాన్ని శుభ్రం చేశారు. ఇక్కడ సేకరించిన చెత్తను సమీపంలోని డంపింగ్ యార్డ్ వద్దకు తరలించారు. కళాశాలలో తొలుత గాంధీజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ జీటీ చంద్రశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాగ్రంథం భగవద్గీత

జి.సిగడాం: మనిషిని మహోన్నతునిగా తీర్చిదిద్ది, నైతిక విలువలతో కూడిన జీవితాన్ని అందించే మహాగ్రంథం భగవద్గీత అని టీటీడీ ధర్మప్రచార పరిషత్ జిల్లా మేనేజర్ ఎం.లలితమణి అన్నారు. మంగళవారం స్థానిక కేజీబీవీలో తిరుపతి తిరుమల దేవస్థానం పంపిణీ చేసిన మానవులందరికీ భగవద్గీత అనే పుస్తకాలను 283 విద్యార్థులకు అందజేశారు. ప్రిన్సిపాల్ ఉషారత్న కుమారి, ఉపాధ్యాయులు, సిబ్బంది, పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

రణస్థలం: యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం నడుకుదిటిపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో రక్తదానం శిబిరం నిర్వహిస్తున్నామని, ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలో యవతీ, యువకులు రక్తదానం చేసి ఈ శిబిరాన్ని విజయవంతం చేయాలన్నారు.

వైభవంగా అసిరితల్లి పండగ

సరుబుజ్జిలి: గ్రామ అసిరితల్లి అమ్మవారి ఘటాల పండగలు మంగళవారం నిర్వహించారు. పొందరవీధి భక్త కమిటీ ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారికి ఘటాలతోము ర్రాటలు అందించి చల్లదనం చేశారు. ఈ పూజల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సాయం

ఇచ్ఛాపురం: ఈదుపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1994-95 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు తోటి విద్యార్థికి అండగా నిలిచారు. కవిటి గ్రామానికి చెందిన పీఎన్ నాగభూషణం కొంత కాలంగా న్యుమోనియా, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆయన కుటుంబానికి రూ.30 వేలు పూర్వ విద్యార్థులు అందజేశారు.

అభివృద్ధి మండళ్లు ఏర్పాటు చేయాలి

ఆమదాలవలస: ఉత్తరాంధ్ర వంటి వెనుకబడిన ప్రాంతాల ప్రగతికి దోహదపడే ప్రాంతీయ మండళ్లను ఏర్పాటు చేయాలని టీడీపీ నేత, రిటైర్డు తహసీల్దార్ పేడాడ జనార్దనరావు కోరారు. మంగళవారం శ్రీహరిపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఐదు జోనల్ వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. గత ప్రభుత్వం ఉత్తరాంధ్రను దోచుకోవడానికి వైసీపీ నేతలు ప్రయత్నించారని ఆరోపించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కూన అప్పలనాయుడు, పలువురు టీడీపీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.